నత్తనడకన సర్వీసు రోడ్డు పనులు

- ప్రారంభించి పదినెలలు గడిచినా పూర్తికాని పనులు
- అసంపూర్తి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు



ఇనుపాముల వద్ద అసంపూర్తిగా ఉన్న సర్వీసు రోడ్డు



పూర్తి కాని వంతెన నిర్మాణం

కేతేపల్లి : మండలంలోని ఇనుపాముల గ్రామంలో 65 నంబర్ జాతీయ రహదారి వెంట నిర్మిస్తున్న సర్వీసు రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ – విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై తరుచూ ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌ల వద్ద ఎన్‌హెచ్‌ఏఐ నివారణ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మండలంలో బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన ఇనుపాముల గ్రామంలో రెండేళ్ల క్రితం సర్వీసు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టింది. ఈ పనుల టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్ గత ఏడాది సెప్టెంబర్‌లో పనులు మొదలుపెట్టారు, కానీ నేటి వరకు పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు.

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం..

ప్రస్తుతం చేపడుతున్న సర్వీసు రోడ్లను విజయవాడ వైపు వెళ్లే మార్గంలో కుడి వైపు మల్లన్నగుట్ట వరకు, ఎడమ వైపు మల్లన్నగుట్ట ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ వరకు నిర్మిస్తున్నారు. అయితే పనులు ప్రారంభించి పది నెలలు గడిచినా సకాలంలో పూర్తి చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇక్కడ సర్వీసు రోడ్డుతో పాటు రోడ్డు వెంట ఇరువైపులా డ్రెయినేజీలు, లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం సర్వీసు రోడ్డు, డ్రెయినేజీ కాల్వలతో పాటు వర్షపు నీరు రోడ్డుకు ఒక వైపు నుంచి మరో వైపుకు వెళ్లేందుకు నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అదే విధంగా రోడ్డు వెంట మట్టి కుప్పలు పోసి చదును చేయకుండా వదిలేశారు. గత మూడు నెలల నుంచి పనుల్లో ఎలాంటి పురోగతి లేకుండా పూర్తిగా నిలిపివేశారు. ఇనుపాముల గ్రామస్టేజీ నుంచి దాదాపు 20గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో జాతీయ రహదారిని దాటే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సర్వీసు రోడ్లు లేకపోవడంతో గ్రామం నుంచి పశువులు, ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేరైతులు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంజూరు చేసిన సర్వీసు రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సర్వీసు రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



ఇనుపాములలో సర్వీసు రోడ్డు పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేయడంతో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాము. మల్లన్నగుట్ట వద్ద నుంచి గ్రామంలోకి రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. సర్వీసు రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– జాల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్, ఇనుపాముల

దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

కనగల్ : భూభారతి దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించాలని నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాదా బైనామాలు, పీఓటీలు మినహా మిగతా దరఖాస్తులన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్వే నంబర్ల మిస్సింగ్, పౌతీలు, డీఎస్ పెండింగ్ వంటి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆయన రికార్డుల గదిని పరిశీలించారు. అంతకు ముందు మండలంలోని అమ్మగూడెం గ్రామంలో తహసీల్దార్ పద్మతో కలిసి ఆయన పర్యటించారు. ప్రజావాణిలో భూవివాదం పరిష్కారం కోరుతూ మాచర్ల సుబ్బయ్య దరఖాస్తు చేసుకోగా సుబ్బయ్య అతని సోదరుడు బ్రహ్మయ్యల మధ్య వివాదానికి కారణమైన భూమిని కొలిచి హద్దులను ఏర్పాటు చేసి వారు భూ వివాదానికి పరిష్కారం చూపారు. కార్యక్రమంలో డీటీ సర్రి పార్వతమ్మ, సీనియర్ అసిస్టెంట్ విఘ్నేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ సునీత, ఏఆర్ఐ యాదగిరి పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలుకు బాధ్యత వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నల్లగొండ టౌన్ : 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు బాధ్యత వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని యాదవ సంఘం భవనంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు 42శాతం రిజర్వేషన్లను సాధించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి చేతులు దులుపుకోకుండా అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. జనగణనలో కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం అనడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, ఆయా పార్టీల నాయకులు పంకజ్‌యాదవ్, ఎల్వీ యాదవ్, పిల్లి రామరాజుయాదవ్, కొండూరు సత్యనారాయణ, వంగూరు నారాయణయాదవ్, పందుల సైదులు, మాదగోని భిక్షపతిగౌడ్, పొట్టబత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ‘క్లీన్ అండ్ గ్రీన్’



క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు

నల్లగొండ టూటౌన్ : పట్టణ పరిధిలోని ఎంజీ యూనివర్సిటీ ఆర్ట్స్ సోషల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2 విద్యార్థులు శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.అరుణప్రియ పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహనతో పాటు స్వీయ బాధ్యతను గుర్తించేలా ప్రతి వారం విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొప్పుల అంజిరెడ్డి, ఆనంద్, షరీఫ్, అనితకుమారి తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి

కనగల్ : ఉపాధిహామీ పథకం కింద సన్న, చిన్నకారు రైతులు మునగ తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జయరాం శనివారం తెలిపారు. ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగి ఉండి ఐదు ఎకరాల భూమి మించకుండా ఉన్నవారు అర్హులని అన్నారు. దరఖాస్తు గడువు ఈ నెల10వ తేదీతో ముగుస్తుందన్నారు. ఎకరాకు రూ.2వేల చొప్పున ఏడాది కాలానికి మొక్కల నిర్వహణ ఖర్చులు అందుతాయని వివరించారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధర్మ స్టూడెంట్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నల్లగొండ టౌన్ : పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ధర్మ స్టూడెంట్స్ యూనియన్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఉమెన్స్ కాలేజీ కన్వీనర్‌గా గౌతమి, కోకన్వీనర్‌గా శ్రావణి, కమిటీ సభ్యులుగా కావేరి, దుర్గ, అఖిల, తేజస్విని, అనూష, అక్షయ, శివాని, అనన్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ సుభాష్, జిల్లా కన్వీనర్ పెరిక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోగుల సహాయకుల ఆకలి తీర్చడం గొప్పవిషయం

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందుతున్న రోగుల సహాయకుల ఆకలి తీర్చడం గొప్ప విషయమని పీఎంజేఎఫ్ లయన్ టి.రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయకులకు ఆయన అల్పాహారం అందజేసి మాట్లాడారు. మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రుల్లో అందజేస్తున్న నిత్య ఉచిత అల్పాహార కార్యక్రమం మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. కార్యక్రమంలో భీమయ్య, మోహన్‌రావు, సతీష్‌కుమారు, శివశంకర్, సింహాద్రి, గోలి అమరేందర్‌రెడ్డి, కేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పరిశీలన



కంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న అధికారులు

గట్టుప్పల్ : మండల కేంద్రంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను కేంద్ర ప్రభుత్వ తనిఖీ బృందం అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, ప్రభుత్వ కార్యాలయాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, కంపోస్ట్‌షెడ్ నిర్వహణ తదితర పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తనిఖీ అధికారి టి.అశోక్‌రెడ్డి, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ ఖాజా మొయినుద్దీన్, ఎంపీడీఓ జె.మాధవరెడ్డి, సాంకేతిక సహాయకులు ఏ.వెంకన్న, పంచాయతీ కార్యదర్శి ఎండీ షఫీ, శివగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు సన్మానం

మునుగోడు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన తల్లి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించి ప్రోత్సాహకం అందజేయనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఆదివారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్న విద్యార్థులను పూలమాల, శాలువాలతో సన్మానించడంతో పాటు నగదు కూడా అందజేయనున్నట్లు తెలిపారు.

ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయంలో వారాహి శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ముగిశాయి. చివరిరోజు శ్రీరుద్ర సహిత వారాహి యజ్ఞోత్సవం పూర్ణాహుతి, లక్ష్మీనారాయణ శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పెన్నా సుబ్రహ్మణ్యశర్మ, బీరవెల్లి గోపాల్‌రెడ్డి, భిక్షారెడ్డి మాజీ కౌన్సిలర్లు చిన్నాల అలివేలు జానయ్య, మాదగోని భవానీగణేష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అంజిరెడ్డి

నార్కట్‌పల్లి : డ్రగ్స్‌పై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మోటివేషనల్ స్పీకర్ గూడూరు అంజిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో డ్రగ్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే యువత జీవితమే నష్టపోతారని, వారి తల్లిదండ్రులు ఎంతో కృంగిపోతారని సూచించారు. యువకులు తమ లక్ష్యాలను చేరుకునేందుకు ఉత్తమమైన లక్షణాలను అలవారుచుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్ మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్, ఉపేందర్‌రెడ్డి, భార్గవి, వీరయ్య, ప్రియాంక, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నకిరేకల్ : వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో నిర్వహించిన పీవైఎల్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులు, సిబ్బందిని నియమించాలని కోరారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100పడకల ఆస్పత్రి భవనం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడోజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు బీవీ చారి, చెరుకు సైదులు, బండారు వెంకన్న, గుంగరబోయిన అంజనేయులు, నర్సయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న తుమ్మల వీరారెడ్డి

శాలిగౌరారం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం అంబారిపేట గ్రామానికి చెందిన పలువురు పార్టీలో చేరగా వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, నాయకులు మక్క బుచ్చిరాములు, ఎర్ర రమేష్, దాసరి దేవచిత్తం, కల్లూరి లింగయ్య, సిరుపంగి అంజయ్య, గుండ్లపల్లి వెంకన్న, డెంకెల లింగయ్య, బట్ట అవనిజ, చలకాని కుమార్, వెంకటయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలి

కేతేపల్లి : మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు ప్రభుత్వం వెంటనే నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్న రాజ్ డిమాండ్ చేశారు. శనివారం మూసీ ప్రాజెక్టును పలువురు రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభంలోనే మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరువలో ఉన్నందున ఇప్పటికే వరినార్లు పోసుకున్న ఆయకట్టు రైతులు నీటి విడుదలపై ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు. వచ్చే మూడు నెలల పాటు సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రస్తుతం మూసీ కాల్వలకు నీటిని విడుదల చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మూసీ ప్రధాన కాల్వకు మరమ్మతుల పేరుతో నీటి విడుదలపై అధికారులు జాప్యం చేయడం సరికాదన్నారు. ఆయన వెంట నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చల్ల కృష్ణారెడ్డి, నాయకులు వంటిపాక సుందర్, వెంకటాద్రి, చెగోని శంకర్, రమేష్, జలంధర్, రైతులు ఉన్నారు.

విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు



నల్లగొండ టౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్

నల్లగొండ టౌన్: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్లులను విడుదల చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కిరణ్, జగన్‌నాయక్, కిషోర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

రామగిరి(నల్లగొండ) : బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థులపై అవమానకరంగా వ్యవహరించిన ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని మాల విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి చింతపల్లి వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు బకాయిలు సాకుగా చూపి పట్టణంలోని ఆల్ఫా పాఠశాలలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సామగ్రి ఇవ్వకుండా వేరుగా తరగతి గదిలో ఉంచి అవమానకరంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



నల్లగొండ టౌన్ : మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి



నార్కట్‌పల్లి : బైక్ ర్యాలీలో పాల్గొన్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

నల్లగొండ టౌన్ : ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున అన్నారు. శనివారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేసి ఆయన మాట్లాడారు. సమావేశంలో కొండ అనురాధ, నలపరాజు సైదులు, కుమ్మరి శంకర్, కొండ వెంకన్న, పోలే సత్యనారాయణ, కోట్ల అశోక్‌రెడ్డి, బొల్లు రవీందర్‌కుమార్, శ్రీను, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో హమాలీలు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, ప్రధాన కార్యదర్శి దండంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అవుట రవీందర్, అంబటి వెంకన్న, నల్లబోతు మధుసూదన్, వనపర్తి సోమయ్య, ప్రవీణ్‌కుమార్, దొండ నరేష్, డి.యాదయ్య, వడ్డే శ్రీనివాస్, మధు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు కెఎస్.రెడ్డి, ఎండీ సయీద్, పి.వెంకట్రావు, దోటి వెంకన్న, నూనె వెంకటేశ్వర్లు, బరిగల వెంకటేష్, వెంకటేశ్వర్లు, లెనిన్ పాల్గొన్నారు.

లేబర్‌కోడ్స్ రద్దు చేయాలి

కనగల్ : కార్మిక హక్కులను కాలరాసే 4లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హమాలీ అడ్డా వద్ద సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కానుగు లింగస్వామి, ప్రజా సంఘాల నాయకులు కందుల సైదులు, ఎండీ అక్రమ్, హమాలీ యూనియన్ నాయకులు పిన్నపురెడ్డి శేఖర్‌రెడ్డి, మునగాల ఈదయ్య, నాగులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలని ర్యాలీ

నకిరేకల్ : కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని ఈ నెల 9న దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వంటెపాక వెంకటేశ్వర్లు, తాడువాయి రాములు, బాత్క సైదులు, సూరారపు వీరయ్య, వంటిపాక నాగార్జున, రమేష్ పాల్గొన్నారు.

చిట్యాల : కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 09న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు మద్దతునిచ్చి విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్ చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ, అద్రూరి శ్రీను, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, శీలా రాజయ్య, ఏళ్ల మారయ్య, తిరుపతి, వెంకట్‌రెడ్డి, నాగయ్య, నర్సింహ, లక్ష్మీనారాయణ, రాములు, ఇద్దయ్య, అజీజ్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు ఎస్ఆర్.వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయన్న మాట్లాడారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టాలు కార్మికులకు, వ్యవసాయ కూలీలకు రైతులకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. ఈ చట్టాల్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న దేశవ్యాప్తంగా సమ్మె చేయాలని సీఐటీయూ పిలుపునిచ్చిందన్నారు. సమ్మెలో కార్మికులు, కూలీలు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెరుకు పెద్దులు, దండు రవి, జాల యాదమ్మ, బొల్లెదు సైదులు, అర్థం శ్రీనివాస్, మహమ్మద్ అలీ, పాల రమేష్, నరసింహ, మల్లేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మా భూములపై హక్కులు మాకే కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మర్రిగూడ : మా భూములకు సంబంధించిన హక్కులను మాకే కల్పించాలని కోరుతూ మండలంలోని ఖుదాబక్షపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల సాయిబండాతండా గిరిజన రైతులు శనివారం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్ 38నుంచి 50వరకు గల 700ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ కబ్జాలో కొనసాగుతున్నామని, 2005లో ఓ వ్యక్తి తమను మభ్యపెట్టి మా వద్ద నుంచి తక్కువ ధరకు భూములను తీసుకున్నాడని, ఆ క్రమంలోనే ఆందోళన చేపడితే మరో వ్యక్తికి 2006లో విక్రయించారని వాపోయారు. 2018లో శివరాత్రి చంద్రయ్య ఓ కంపెనీ పేరిట కొనుగోలు చేశారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు అట్టి భూముల్లో తామే వ్యవసాయం చేసుకుంటున్నామని, పొలాల్లోకి వెళ్లకుండా రైతులను బెదిరిస్తున్నారని వాపోయారు. ట్రిబ్యునల్ కోర్టులో రైతులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, తమ భూముల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోని న్యాయం చేయాలని వారు వినతిపత్రంలో కోరారు.

సంక్షిప్త సమాచారం

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

తిప్పర్తి : మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని రాజుపేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజుపేట గ్రామానికి చెందిన జల్లేల ఎల్లమ్మ(30) మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఈ నెల 3న రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి పోయింది. అప్పటి నుంచి ఆమె తిరిగి రాకపోవడంతో కుమారుడు జల్లేల మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు మండల పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని వినతి

చిట్యాల : మున్సిపాలిటీలో కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం స్థానిక పదో వార్డుకు చెందిన ప్రజలు సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. పరిశ్రమల నుంచి వస్తున్న బూడిద, పొగతో ఇబ్బందులు పడుతూ అనారోగ్యానికి గురవుతున్నామని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు చికిలంమెట్ల అశోక్, బొబ్బల శివశంకర్‌రెడ్డి, కమ్మర దేవి, ముప్పిడి కవిత, తంగళ్లపల్లి అరుణ, కళావతి, పుష్పలత ఉన్నారు.

పీహెచ్‌సీలను బలోపేతం చేయాలి

నల్లగొండ టౌన్ : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, పట్టణ కార్యదర్శి భూతం అరుణకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సర్వే చేసి వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, శృతి, శ్రావ్య పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేయాలి

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి ఇటీవల కేటాయించిన రెండో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను మండలంలో ఏర్పాటు చేయాలని స్వేరోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రవరం సునీల్ శనివారం అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. నియోజకవర్గంలో అన్ని మండల కేంద్రాలలో పలు రకాల ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, గురుకుల విద్యాలయాలు ఉన్నాయని, చిట్యాలలో ఇప్పటి వరకు కేటాయించలేదన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

గట్టుప్పల్ : పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎస్ఆర్ఐ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అంతంపేట గ్రామ సోమరాజు గూడ సోమేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించి అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో గార్లపాటి కృష్ణారెడ్డి, పూసపాటి శంకరప్ప, జనగాం వెంకటయ్య, రాచమల్ల వెంకటరెడ్డి, సిర్రపు శేఖర్‌రెడ్డి, భుజంగం, వీరమల్ల అశోక్, మాతంగి నరేందర్, గూడపు జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బోర్డు డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే వీరేశం



డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

నకిరేకల్ : తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే వేముల వీరేశం ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకులతో కలిసి ఆయన శనివారం హైదరాబాద్‌లోని టీజీ ఏసీపీడీసీఎల్ డైరెక్టర్ ముషరఫ్‌ను కలిశారు. అనంతరం ఉద్యోగుల వివిధ సమస్యలపై ప్రస్తావించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి నాయకుల అభినందనలు



నల్లగొండ టౌన్ : బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎన్.రామచందర్ రావును జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు శనివారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల నరసింహారెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతెపాక సాంబయ్య, అసెంబ్లీ కన్వీనర్ దాయం భూపాల్‌రెడ్డి, లింగయ్య, సాయి తదితరులు ఉన్నారు.

కనగల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్.రామచంద్రరావును ఆ పార్టీ మండల నాయకులు శనివారం హైదరాబాద్‌లో కలిశారు. కలిసిన వారిలో పిండి పాపిరెడ్డి, తిరందాస్ కనకయ్య, మాలే వెంకటరెడ్డి, పర్సనబోయిన భిక్షం, మండల ప్రధాన కార్యదర్శి నీలకంఠం వెంకన్న ఉన్నారు.